# మంచి మమ్మీ కావాలి

-రావి-ఎన్-అవధాని

మమ్మీ ఎందుకు నన్ను కిస్ చెయ్యదు? అందరి మమ్మీల్లాగ ఒళ్లో కూర్చోపెట్టుకొని కథలు, కబుర్లూ ఎందుకు చెప్పదు? మమ్మీకి అసలు నేనంటే యిష్టం లేదా? ఎప్పుడు చూసినా డ్రస్ నలిగిందనో, క్రాఫ్ చెరిగిందనో, చెప్పులు వేసుకోలేదనో తిడుతుంది ఎందుకు?'' బంటీకి ఎప్పుడూ యివే ఆలోచనలు.

చంద్రశేఖరరావు అఖిలాండేశ్వరుల ఏకైక సంతానం బంటీ. వయస్సు ఏడు సంవత్సరాలు. థర్డ్‌క్లాస్ చదువుతున్నాడు. చురుకైనవాడు. మంచి తెలివితేటలున్నాయి.

చంద్రశేఖర్రావు పెద్ద వ్యాపారవేత్త. అతనికి మూడు వూర్లలో వ్యాపార సంస్థలున్నాయి. ప్రతి బ్రాంచిలోనూ వారంలో రెండుమూడు రోజులుండి బిజినెస్ చూసుకుంటాడు. ఆ విధంగా అతను తరుచు కేంపులో వుంటాడు. బంటీ అతని ఆరో ప్రాణం. వాడు పుట్టేక అతని వ్యాపారం అభివృద్ధి చెందింది.

అఖిలాండేశ్వరికి వూర్లో మంచి పలుకుబడి వుంది. లేడీస్ క్లబ్ ప్రెసిడెంట్. ఆవిడకు స్టేటస్ కావాలి. అందుకోసం ఎంత ఖర్చయినా వెనుకాడదు. రోజుకు అరడజను డ్రెస్సులు మారుస్తుంది. కొడుకు సంరక్షణ కోసం ఆయాను పెట్టింది. పనివాళ్లను క్రమశిక్షణలో వుంచుతుంది.

చంద్రశేఖరరావు యింటి దగ్గర వున్న సమయంలో ఎక్కువభాగం బంటీతోనే గడుపుతాడు.

''వాడిని అలా ముద్దు చేయకండి! అది మంచిది కాదు! వాడు ఎందుకూ పనికిరాని మొద్దు అవగలడు!'' అని భర్తను తరుచు హెచ్చరిస్తుంది అఖిలాండేశ్వరి.

బంటీ తన స్కూలు, చదువు, ఫ్రెండ్స్, గేమ్స్ అన్ని విషయాలూ ఎంతో ఉత్సాహంతో తండ్రికి చెప్పాడు.

కొడుకు చెప్పే విషయాల్లో ఎక్కువ భాగం దీపక్ గురించే . దీపక్ బంటీ క్లాస్‌మేట్. ఒకే యీడువాళ్లు. చదువు, ఆటలు, పాటలు అన్నిటిలోనూ దీపక్ ఫస్ట్. అందుకే వాడిని అందరూ మెచ్చుకుంటారు. వాడి ఫ్రెండ్షిప్ కోరుతారు.

చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన దీపక్‌ని వాడి తల్లి నీరజ ఎంతో గారాబంతో పెంచుతోంది. వాడికి ఏ విషయంలోనూ తండ్రిలేని లోటు కనబడనీయదు. నీరజ భర్త ముకుందరావు పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసేవాడు. హార్ట్ ఎటాక్ వచ్చిపోయేడు. అతడు వారికోసం మిగిల్చిన ఆస్తి చిన్న డాబాయిల్లు, నెలకు పదిహేను వందలు ఫేమిలీ పెన్షన్. నీరజ వాటితోనే కాలక్షేపం చేస్తోంది.

కొడుకు స్కూలునుంచి వచ్చిన వెంటనే వాడి స్కూలు డ్రస్ మార్చి కాళ్లూ, చేతులూ, ముఖమూ కడిగి అన్నం కాని టిఫిన్‌కానీ తినిపిస్తుంది నీరజ. తరువాత వాడి ఫ్రెండ్స్ చింటూ, బాబ్జీ, పింకీ బుక్స్ తీసుకొని వస్తారు. కొడుకునీ వాళ్ళనీ కూర్చోబెట్టి వాళ్లకు ఆరోజు స్కూల్లో చెప్పిన లెసన్స్ గురించి ప్రశ్నలు వేసి వారు ఎంతవరకూ ఫాలో అయ్యేరో తెల్సుకొని డౌట్స్ తీరుస్తుంది. హోంవర్క్ చేయించి టైంటేబిల్ చూసి మర్నాడు వాళ్లకు క్లాసులో చెప్పబోయే లెసన్స్ చెప్పి ప్రిపేర్ చేస్తుంది.

వాళ్లచేత వర్డ్స్ బిల్డింగ్-అంత్యాక్షరితో పట్టణాలపేర్లు, నదులు, కొండలు, జంతువులు, పక్షుల పేర్లు స్పెల్లింగ్స్‌తో చెప్పించడం లాంటి గేమ్స్ ఆడిస్తుంది. మంచి కథలు చెప్తుంది.

నీరజ ఓర్పుకు, నేర్పుకు దీపక్ ఫ్రెండ్స్ తల్లిదండ్రులు ఆమెను మెచ్చుకొని ఆమెకు ధన సహాయం చేయబోయేరు. కాని ఆమె వారిని వారించడంతో పళ్లు, కాయకూరలు, తినుబండారాలు తమ పిల్లల ద్వారా తరుచు ఆమెకు పంపుతూ తమ కృతజ్ఞతలు వెల్లడి చేస్తున్నారు. తమ పిల్లల కోసం ఏ వస్తువు కొన్నా దీపక్‌కి కూడా కొనిస్తున్నారు.

బంటీ నాలుగైదుసార్లు దీపక్ యింటికి వెళ్లి ఆమె మాతృప్రేమను, వాత్సల్యాన్ని చవిచూసేడు. వాడి దృష్టిలో దీపక్ మమ్మీ ఓ దేవత! ఆ విషయమే ఎప్పుడూ తన తండ్రికి చెప్తుంటాడు బంటీ.

చంద్రశేఖర్రావు వూరునుంచి వచ్చినప్పుడల్లా కొడుకు కోసం మంచి డ్రెస్, ఆట వస్తువులు, తినుబండారాలు తెస్తూంటాడు. ఓరోజు రిమోట్ కంట్రోల్‌తో నడిచే అడుగున్నర ఎత్తున్న రోబోట్ బొమ్మ తెచ్చేడు. ఖరీదు ఆరువేలు. టార్చిసెల్స్‌తో పనిచేస్తుంది. బంటీ ఆనందానికి అవధుల్లేవు. ఫ్రెండ్స్‌ని పిల్చుకొని వచ్చి దానిని చూపించాలని దీపక్ యింటికి వెళ్లేడు. వీడు వెళ్లేసరికి వాళ్లు-దీపక్, చింటూ, బాబ్జీ, పింకీ, కేరమ్స్ ఆడుకొంటున్నారు.

''రా బాబూ! నువ్వూ వాళ్లతో కేరమ్స్ ఆడతావా? దీపూ బంటీని కూడా ఆడనివ్వండి!'' అంది నీరజ.

బంటీ రోబోట్ గురించి గొప్పగా చెప్పి వాళ్లను చూడ్డానికి రమ్మని పిలిచేడు.

బంటీ యింటికి సాధారణంగా పిల్లలెవరూ వెళ్లరు. అఖిలాండేశ్వరి అంటే భయం. అందువల్ల వాళ్లు సందేహంలో పడ్డారు.

''మా మమ్మీ యింట్లో లేదు! క్లబ్‌కి వెళ్లింది'' అన్నాడు బంటీ.

''వెళ్లి చూసి త్వరగా వచ్చేయండి'' అని వారిని పంపించింది నీరజ.

వాళ్లకు దార్లో మరో అరడజను మంది ఫ్రెండ్స్ కలిసేరు. అందరూ బంటీ యింటికి వెళ్లి రోబోట్ చేసే విన్యాసాలను చూస్తూ ఆనందంతో కేకలు వేస్తూ గెంతుతున్నారు.

అప్పుడే కారు దిగి తన ఫ్రెండ్స్‌తో లోనికి వచ్చిన అఖిలాండేశ్వరి కంటపడిందీ దృశ్యం. ఆమెకు ఎక్కడలేని కోపం వచ్చింది.

''ఏమిటిది! యిల్లా ఫిష్ మార్కెట్టా! బ్రూట్స్! యింట్లో నౌకర్లంతా ఏమయ్యేరు? యీ కోతి మూకంతా చేరి సోఫాలూ, కార్పెట్లూ మట్టికాళ్లతో కుమ్మి నాశనం చేస్తూంటే! పొండి బయటకు'' అంటూ చేతిలోవున్న వేనిటీ బేగ్‌తో దీపక్‌ను కొట్టింది. దాంతో వాడు తూలి టీపాయ్ మీద పడ్డాడు. నుదురు చిట్లి రక్తం వస్తోంది. పిల్లలందరూ బయటకు పరిగెత్తేరు.

పింకీ యిల్లు దగ్గర్లో వున్నందున దీపక్‌ని వాళ్లింటికి తీసుకొని వెళ్లి జరిగింది చెప్పేరు. పింకీ మమ్మీ దీపక్ గాయానికి ఫస్ట్ ఎయిడ్ చేసి డాక్టర్ని పిలిపించింది. నీరజ విషయం తెల్సుకొని వచ్చింది. డాక్టర్ వచ్చి గాయానికి మందు వేసి కట్టుకట్టి యింజక్షన్ చేసేడు. మరేం పర్వాలేదని ధైర్యం చెప్పి వెళ్లేడు.

విషయం విన్నవాళ్లంతా అఖిలాండేశ్వరి దుడుకుతనాన్ని దూషించేరు. నీరజ పింకీ మమ్మీ చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పి కొడుకును తీసుకొని వెళ్లిపోయింది.

మర్నాడు సాయంత్రం బంటీ దిగులుగా ఏటో చూస్తూ యింట్లో ఓ మూల కూర్చుని వుండడం చూసేడు చంద్రశేఖర్రావు. కొడుకు ఎప్పుడూ అంత డల్‌గా వుండడం చూడ



లేదు.

''ఏం బాబూ అలా వున్నావు! ఒంట్లో బాగులేదా?'' అంటూ కొడుకు నుదిటిమీద చేయివేసి చూసేడు.

బంటీ దీనంగా తండ్రివేపు చూసేడు. వాడి చెక్కిళ్లమీద కన్నీటి మరకలు చూసి వాడిని దగ్గరకు తీసుకొని బుజ్జగించి ఏం జరిగిందో చెప్పమన్నాడు.

క్రితం రోజు జరిగిన విషయం తండ్రికి చెప్పేడు.

''ఈరోజు స్కూల్లో పిల్లలందరూ నన్ను చూసి 'బంటీ మమ్మీ రాక్షసి! పిశాచి! వీడు డెవిల్స్ సన్!' అని గేలిచేసేరు. వాళ్లందరూ నా జట్టు కట్‌చేసి నాతో మాట్లాడలేదు. టీచర్‌కి రిపోర్ట్ చేసేను. కాని టీచరు వాళ్లను ఏమీ అనలేదు'' అన్నాడు దుఃఖాన్ని ఆపుకుంటూ.

కొడుకుని ఎలా సమాధాన పర్చాలా? అని ఆలోచిస్తున్న సమయంలో-

''డాడీ! నాకు...'' అంటూ ఏమో చెప్పబోయి తల్లి అటు రావడం చూసి ఆగిపోయేడు.

చంద్రశేఖర్రావు భార్య వేపు ఒక పర్యాయం చూసి-

''నీకేం భయం లేదు! ధైర్యంగా చెప్పు ఏం కావాలో? నీకేం కావాలంటే అది క్షణంలో తెస్తాను'' అన్నాడు.

''ప్రామిస్!'' అంటూ చేయి జాచేడు బంటీ ఆనందంగా.

''డబుల్ ప్రోమిస్!'' అంటూ కొడుకు చేతిలో చేయి వేసేడు నవ్వుతూ.

''డాడీ! దీపక్ మమ్మీలాంటి మంచి మమ్మీ నాకు కావాలి!'' అన్న కొడుకు మాటలకు నిర్ఘాంతపోయేరు చంద్రశేఖర్రావు, అఖిలాండేశ్వరి.

★